క్లుప్తంగా

వాలీబాల్ జట్టుకు అభినందన



విజేతలను అభినందిస్తున్న శశికిరణ్‌వర్మ

రాజానగరం: జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా గుంటూరులో ఈ నెల 15 నుంచి 17 వరకూ నిర్వహించిన విజ్ఞాన్ మహోత్సవ్ 2023 క్రీడా పోటీల్లో వాలీబాల్‌లో గైట్ కళాశాల జట్టు రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఈ మేరకు సోమవారం క్రీడాకారులను, పీడీ డాక్టర్ సీఎం హెన్రీలను కళాశాల ఎండీ కె.శశికిరణ్‌వర్మ అభినందించారు. కళాశాల తరఫున క్రీడలకు ఎల్లప్పుడూ ప్రోత్సాహం ఉంటుందన్నారు.

రాయితీపై దాణామృతం

రాజానగరం: పాడి పశువులకు అవసరమైన దాణామృతం (టీఎంఆర్)ను రాయితీపై సరఫరా చేస్తున్నామని పశు సంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ ఎంఎస్ఎస్ మూర్తి తెలిపారు. అవసరమైన రైతులు సమీప గ్రామ సచివాలయాల్లో వెటర్నరీ అసిస్టెంట్లను కలసి, దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. కిలో రూ.6.50 చొప్పున ఒక్కో రైతు అవసరాన్ని బట్టి ఆర్డర్ పెట్టుకోవచ్చన్నారు.

ఆపద మిత్రలకు ముగిసిన శిక్షణ

మధురపూడి: కోరుకొండ మండలంలో పలువురు వలంటీర్లకు ఆపదమిత్రలుగా ఇచ్చిన శిక్షణ పూర్తయ్యిందని ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కోరుకొండ నుంచి ఎం.సంతోష్‌కుమార్, మునగాల నుంచి గంధం శివఫణీంద్ర, గాదరాడ నుంచి ఎం.వినాయక మణికంఠ, గాడాల నుంచి ఎం.దుర్గాప్రసాద్, దోసకాయలపల్లి నుంచి ఇందల శ్రీనులను శిక్షణకు చేశామని తెలిపారు. వీరు ఈ నెల 6వ తేదీ నుంచి 17 వరకూ సామర్లకోటలో శిక్షణ పొందారన్నారు. విపత్తులు, ఆపదలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారన్నారు.

వైఎస్సార్ సీపీలో బీసీలకు గుర్తింపు

బిక్కవోలు: వైఎస్సార్ సీపీలో బీసీలకు గుర్తింపు ఉంటుందని జిల్లా మహిళ సంక్షేమ సంఘం చైర్మన్ రొంగల పద్మావతి అన్నారు. సోమవారం ఆమె కొంకుదురులో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థుల ప్రకటించడంతో బీసీలకు గుర్తింపు లభించిదన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా కుడుపూడి సూర్యనారాయణ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీసీ సముఖస్థానం ఇచ్చారన్నారు. బీసీలు మరింత బలోపేతమవ్వాలని, సీఎం జగన్‌కు అండగా నిలివాలని ఆమె కోరారు.

టీకాలు వేయించాలి

మధురపూడి: ఇటీవల కాలంలో పందులకు స్వైన్ ఫీవర్ వ్యాధి సోకుతున్నట్టు గుర్తించామని పశు సంవర్ధక శాఖ ఏడీ మోతా సత్యనారాయణమూర్తి తెలిపారు. పెంపకందారులు వెంటనే పందులకు టీకాలు వేయించాలని, అజాగ్రత్త వహిస్తే పందులు చనిపోయే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే పలు పందులకు టీకాలు వేశామని, పెంపకందారుల సహకారం లేకపోవడంతో ఈ ప్రక్రియ పూర్తి కాలేదన్నారు. వీటివల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు.

మానవత చాటిన చిన్నారులు



సేకరించిన విరాళాలను కరస్పాండెంట్ ద్వారా అందజేస్తున్న విద్యార్థులు

రాజానగరం: దివాన్‌చెరువులో వైద్యానికి ఇబ్బంది పడుతున్న ఓ మహిళకు సమీపంలోని బాలవికాస్ విద్యా మందిర్‌కు చెందిన విద్యార్థులు విరాళాలు సేకరించి, చిరుసాయాన్ని అందించారు. ఎం.రామలక్ష్మి ఉదర సంబంధ వ్యాధితో బాధపడుతుంది. శస్త్రచికిత్స చేయాల్సి ఉండటంతో ఆమె పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గమనించిన ఆ చిన్నారులు స్పందించి, మానవతను చాటారు. తమ పాకెట్ మనీతో పాటు మరికొంత నుంచి విరాళాలు సేకరించి, రూ.25,840ను పాఠశాల కరస్పాండెంట్ యర్రంశెట్టి నాగేశ్వరరావు ద్వారా ఆమె కుమారునికి అందజేశారు.

క్షయ వ్యాధిపై అవగాహన

రాజానగరం: క్షయ వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని పాలచర్ల పీహెచ్‌సీ డాక్టర్ శ్రీరాణి అన్నారు. టీబీ నివారణా వారోత్సవాలలో భాగంగా దివాన్‌చెరువులో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. టీబీ విభాగం సూపర్‌వైజర్ శేషగిరిరావు మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు ఉన్నవారికి ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటు, నిర్ధారణ అయితే చికిత్స అందజేస్తారన్నారు. హెచ్‌వీడీడీ భవాని, క్లస్టర్ హెల్త్ అసిస్టెంట్ పి.పుల్లారావు, సీహెచ్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గోకవరం: క్షయ (టీబీ) వ్యాధిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ సూచించారు. టీబీ పక్షోత్సవాల్లో భాగంగా స్థానిక కేవీఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ పీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టీబీ వ్యాధి లక్షణాలు, పరీక్షలు, చికిత్స విధానంపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు బాబూరావు, అబ్బులు, రాంబాబు, హెల్త్ అసిస్టెంట్లు పవన్, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వామి స్నానమాడగ.. మది పులకించగ

- ఘనంగా శ్రీవారి చక్రస్నానం
- భారీగా తరలివచ్చిన భక్తజనం



సంపరలో శ్రీవారికి స్నానం చేయిస్తున్న అర్చకులు, భక్తులు

అనపర్తి: స్థానిక పాతవూరిలోని సత్తి పోతారెడ్డి, తేతలి రామిరెడ్డి రామాలయంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి పాంచాహ్నిక వార్షిక కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఐదో రోజు సోమవారం స్వామివారి చక్రస్నానం వైభవోపేతంగా జరిగింది. వైఖానస ఆగమ శాస్త్రానుసారంగా నదురుబాదకు చెందిన వేదపండితులు అంగర ప్రసాద్ నేతృత్వంలో గ్రామానికి చెందిన మేడపాటి చెల్లారెడ్డి, మహాలక్ష్మి దంపతులతో ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లికిలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాంతం భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో స్థానిక నల్ల కాలువ బ్రాహ్మణరేవు వద్ద చక్ర పెరుమాళ్లకు పంచామృత ద్రవ్యాలతో అభిషేకాలు చేసి శ్రీవారి చక్రస్నానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అవభృత స్నానం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కర్రి రామారెడ్డి, తేతలి వెంకటరెడ్డి, సత్తి పోతారెడ్డి, చిర్ల వీర్రాఘవరెడ్డి, ద్వారంపూడి సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంపర గ్రామంలో..

పెదపూడి: సంపర గ్రామంలోని వీక్షణ ముక్తేశ్వరస్వామివారి ఆలయంలో బాలాత్రిపుర సుందరి సమేత ముక్తేశ్వరస్వామి వారికి సోమవారం శ్రీచక్రస్నానం ఘనంగా నిర్వహించారు. భక్తుల శివనామస్మరణ మధ్య స్వామి వారికి త్రిశూల స్నానం కనుల పండువగా జరిగింది. మంగళవారం స్వామివారి పుష్పోత్సవం నిర్వహిస్తారని ఆలయ కమిటీ చైర్మన్, ప్రముఖ పండితులు ఖండవిల్లి హనుమంతాచార్యులు తెలిపారు. కరకుదురులో కేశవస్వామి వారి ఆలయంలో శ్రీ చక్రస్నానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వుండ్రు చంద్రకళ, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

మార్కేండయ స్వామిని దర్శించిన ఎమ్మెల్యే

పెదపూడి: ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక భావాలు అలవరుచుకోవాలని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలోని మైనర్ నగర్‌లో మార్కేండేయస్వామి వారి ఆలయం వద్ద సోమవారం అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి వారిని దర్శించుకొని, పూజల్లో పాల్గొన్నారు. ఏటా స్వామివారి కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీని ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కేండయ ఆలయ ప్రతినిధులు శీరం రాఘవ, సామల కొండ, రాపర్తి రాంబాబు, రాపర్తి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ తేదీ మార్పు చేయాలి



కలెక్టర్ మాధవీలతకు వినతి పత్రం అందిస్తున్న సత్తిబాబు

రంగంపేట: గ్రాసిమ్ పరిశ్రమకు చెందిన కెమికల్ డివిజన్ విస్తరణకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ తేదీ మార్పు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయంతో నిర్వహించిన స్పందనలో కలెక్టర్ మాధవీలతకు వినతి పత్రం అందించినట్టు వెలుగుబంటి సత్తిబాబు తెలిపారు. గ్రాసిమ్ పరిశ్రమ కెమికల్ విస్తరణకు ఈనెల 28న జరుగుతుందని కాలుష్య నియంత్రణ మండలి అధికారి జనవరి 7, 11వ తేదీల్లో ప్రజాభిప్రాయ సేకరణ కొరకు తహసీల్దార్‌కు, దొంతమూరు, సింగంపల్లి, నల్లమిల్లి గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు సమాచారం ఇచ్చి గ్రామస్తులకు తెలియజేయాలని కోరారు. అయితే ఫిబ్రవరి 7వ తేదీ వరకు ఆయా గ్రామ పంచాయితీల్లో సమాచారం బహిరంగ పరచలేదని, దండోరా కానీ, మైక్ ద్వారా కాని ప్రజలకు అవగాహన కల్పించలేదని, కాబట్టి ప్రజాభిప్రాయ సేకరణ తేదీ మార్పు చేసి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించిన తరువాత ప్రజాభిప్రాయ సేకరణ జరగాలని కోరుతూ వినతిపత్రం అందించాలమని సత్తిబాబు తెలిపారు.

బిక్కవోలు: ప్రజాభిప్రాయ సేకరణ మార్పు చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందించినట్టు బలభద్రపురం గ్రామం మాజీ ఎంపీటీసీ సభ్యులు నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలోని మండలంలోని గ్రాసీమ్ ఇండస్ట్రీస్ కెమికల్ డివిజన్ విస్తరణకు సంబంధించిన ప్రజా అభిప్రాయ సేకరణ తేదీని మార్పు చేయాలని కోరుతూ కలెక్టర్ వినతి పత్రం అందించినట్టు తెలిపారు.

పాఠ్యాంశాల రచయితకు అభినందన



డాక్టర్ గోపాలకృష్ణను అభినందిస్తున్న వీసీ ఆచార్య ప్రసాదరాజు, రిజిస్ట్రార్ ఆచార్య అశోక్

రాజానగరం: రాష్ట్ర తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో ముద్రించిన ఐదు బీఈడీ పాఠ్య పుస్తకాలలో కొన్ని పాఠ్యాంశాలను ఆదికవి నన్నయ యూనివర్సిటీ సహాయ అధ్యాపకుడు డాక్టర్ ఎం.గోపాలకృష్ణ రచించారు. సోమవారం ఆయన్ని ఇన్‌చార్జి వీసీ ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు అభినందించారు. భౌతికశాస్త్ర బోధనా పద్ధతులు 1, 3 సెమిస్టర్స్, తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాలలో ముద్రించిన పుస్తకాలు, సైకాలజీ అభ్యసన మదింపు పాఠ్య పుస్తకాలకు రచనా సహకారం ఆయన అందించారు. ఈ పుస్తకాల నుంచి టీఈటీ, సీటీఈటీ, డీఎస్సీ తదితర పోటీ పరీక్షలకు ప్రశ్నలు వస్తాయని గోపాలకృష్ణ వివరించారు.

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

గోకవరం: జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో మండలంలోని మల్లవరం హైస్కూల్ విద్యార్థిని ప్రథమ స్థానం సాధించింది. వివరాల్లోకి వెళితే... బాలికా దినోత్సవం సందర్భంగా గత నెల 24న రాజమహేంద్రవరంలోని వీటీ హైస్కూల్‌లో తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో మల్లవరం హైస్కూల్ విద్యార్థిని ఆర్.శాంతికుమారి ప్రథమ స్థానంలో నిలిచింది. రాజమహేంద్రవరంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆమెకు బహుమతిని అందజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థినితో పాటు ఆమెకు గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయురాలు ఝాన్సీని ఎంఈఓ బి.గౌరమ్మ, హెచ్ఎం ఎస్‌వీవీ సత్యనారాయణ అభినందించారు.

కులాలు వేరైనా బీసీలంతా ఒక్కటే

రంగంపేట: బీసీలంతా ఒక్కటిగా ఉంటేనే తగిన న్యాయం జరుగుతుందని బీసీ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సింగంపల్లి గ్రామంలో మండల బీసీ నాయకులు గుత్తుల సుబ్రహ్మణ్యం, గురజారపు వీరభద్రరావు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన బీసీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బీసీలంతా సంఘంగా ఏర్పడి మన హక్కులను సాధించుకోవచ్చన్నారు. సౌత్ ఇండియా మహిళా విభాగం అధ్యక్షురాలు రేవళ్ల కృష్ణవేణి, నేషనల్ కో–ఆర్డినేటర్ పి.పద్మ, రాష్ట్ర కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు పితాని రాజు, నాయకులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

గోకవరం: నువ్వుల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని రంపచోడవరం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.చిరంజీవి అన్నారు. మండలంలోని రంపయర్రంపాలెంలో జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న నువ్వుల పంటను సోమవారం ఆయన పరిశీలించారు. మొలక శాతం, తెగుళ్లను గుర్తించి రైతులకు పలు సూచనలు చేశారు. పంట పురుగుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఎరువుల వాడకం తగ్గించి పచ్చిరొట్ట విత్తనాలు సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

స్పందనకు రెండు అర్జీలు

రంగంపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో రెండు వినతులు అందాయని తహసీల్దార్ వాకాడ అమ్మాజీ తెలిపారు. జి.దొంతమూరులో విశ్వబ్రాహ్మనులు కమ్మరి, వడ్రంగి కులస్తులకు ప్రభుత్వం గతంలో 20.46 సెంట్లు భూమి మంజూరు చేసిందని, దానిలో 14.50 సెంట్ల భూమిని అమ్మివేశారని, మిగిలిన 6 సెంట్ల భూమి నిరుపయోగంగా ఉందని, దానిని సర్వే చేసి తమకు ఇప్పించాలని కోరుతూ దొంతమూరుకు చెందిన కుమ్మరి, వడ్రంగిలు వినతి పత్రం అందజేశారు. ఎస్టీరాజాపురం గ్రామానికి చెందిన కొందరు తమ గ్రామంలో సర్వే నంబరు 20లో 3.85 సెంట్లు భూమిని రీ సర్వేలో సర్వే చేసి ఆ భూమిని ఆన్‌లైన్ చేయాలని మరొక వినతి అందించారని ఆమె తెలిపారు.

కుతుకులూరులో ఫ్యామిలీ ఫిజీషియన్



రోగులకు మందులు అందజేస్తున్న దృశ్యం

అనపర్తి: కుతుకులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ నల్లమిల్లి సుబ్బారెడ్డితో కలిసి కుతుకులూరు సర్పంచి గొల్లు హేమతులసి సోమవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ పీహెచ్‌సీ చైర్మన్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి పేదవాడికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చాందినికుమార్, పంచాయతీ వార్డు సభ్యుడు సబ్బెళ్ల రామారెడ్డి, నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, ఆశవర్కర్లు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పశు సంరక్షణపై అవగాహన అవసరం

- కాకినాడ పశుసంవర్ధక శాఖ డీడీ వెంకటేశ్వరరావు
- దోమాడలో లేగదూడల ప్రదర్శన



దోమాడలో మాట్లాడుతున్న డీడీ ఆర్.వెంకటేశ్వరరావు

పెదపూడి: లేగదూడల పోషణ, సంరక్షణపై పాడి రైతులు అవగాహన కలిగి ఉండాలని కాకినాడ పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వెంకటేశ్వరరావు అన్నారు. దోమాడ గ్రామంలో మండల పశువైద్యాధికారి చింతా కిరణ్మయి ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆర్.వెంకటేశ్వరరావు, పశుగణాభివృద్ధి శాఖ ఈఓ డాక్టర్ అంబేడ్కర్, సామార్లకోట ఏవీహెచ్ సహాయ సంచాలకులు డాక్టర్ కె.తాతయ్య, వీఏఎస్ డాక్టర్ ఎం.భవాని తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో 40 మంది పాడిరైతులు వారి లేగదూడలను ప్రదర్శనలో ఉంచారు. ప్రదర్శనలో లేగదూడల వయస్సు, బరువు, మేలైన గుణాలు పరిశీలించారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో రైతులు జి.వినోద్, మీనవల్లి సాయిబాబులకు సంబంధించి లేగదూడలు నిలిచాయి. వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాడి రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని, పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కృత్రిమ గర్భధారణ, సెక్స్ సార్టెడ్ సెమన్ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం పాడి రైతులకు ఉచితంగా పాలక్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి మీనవల్లి శారదదేవి, స్థానిక గ్రామ పశుసంవర్ధశాక సహాయకుడు జల్లు ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని కోరుతూ ధర్నా

రాజానగరం: సాగుదారులకు న్యాయం చేయాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేశారు. ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు జనిపెల్ల సత్తిబాబు మాట్లాడుతూ నందరాడలో 8.24 ఎకరాల సీలింగ్ భూమిని నందరాడ, నరేంద్రపురం గ్రామాలకు చెందిన 40 మంది పేదలు 18 ఏళ్లుగా సాగు చేస్తున్నారన్నారు. ఇటీవల ఈ భూమిని విక్రయించారని, వెంటనే ఆ విక్రయాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు కూలీ సంఘం ప్రతినిధులు జి.సూరిబాబు, ఎం.వెంకన్న, మరుకుర్తి వీరలక్ష్మి, బొలిశెట్టి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వైవీ రావు మృతి ఆర్టీసీకి తీరని లోటు

గోకవరం: ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ అమరావతి ప్రధాన కార్యదర్శి వైవీ రావు అకాల మరణం ఆర్టీసీకి తీరని లోటు అని ఈయూ చీఫ్ ఎగ్జిక్యూటివ్ పైడిమళ్ల లక్ష్మణ్‌రావు తెలిపారు. గోకవరం ఆర్టీసీ డిపో ఆవరణలో సోమవారం వైవీ రావు సంతాప సభ నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్టీసీకి ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఈయూ అధ్యక్ష, కార్యదర్శులు అక్కిరెడ్డి కృష్ణ, ప్రగడ ప్రసాద్, శ్రీను, ఆర్‌బీ దొర, దేముడు శ్రీను, ఎస్ఎంయూ నాయకులు మేడా మురళీ, వైఎస్సార్ యూనియన్ నాయకుడు జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.